క్లుప్తంగా

నేటి నుంచి 'ఓపెన్' డిగ్రీ తరగతులు



నర్సంపేట : నేటి (ఆదివారం) నుంచి అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల ప్రథమ సంవత్సరం తరగతులు ఆదివారాల్లో కొనసాగుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, అభ్యాసకుల సహాయ కేంద్ర కోఆర్డినేటర్ లకన్ సింగ్ తెలిపారు. కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విశ్వవిద్యాలయ స్టూడెంట్ సర్వీస్ బ్రాంచ్ డైరెక్టర్ ఎల్వీకె.రెడ్డి ఆఫ్లైన్ షెడ్యూల్‌ను విడుదల చేశారని చెప్పారు. ప్రథమ సంవత్సర విద్యార్థులు ఆదివారాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్న తరగతులకు హాజరు కావాలని తెలిపారు. విద్యార్థులకు పోస్టు ద్వారా పుస్తకాలు పంపిస్తారని వివరించారు. అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి బుక్స్ పోస్టు ద్వారా పంపడం జరుగుతుందని అన్నారు. స్టడీ సెంటర్ సమాచారం కోసం సెల్ నంబర్ 7382929577, 9949371969ల్లో సంప్రదించాలని చెప్పారు. సమావేశంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, సత్యనారాయణ, కౌన్సిలర్లు డాక్టర్ రమేశ్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఖానాపురం : మండల కేంద్రంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడారు. మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. వైద్యుల సూచనలు పాటించాలని చెప్పారు. వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కమిటీ ఎన్నిక

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల మండల కమిటీని నియమించారు. ఈ మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరిబాబు కార్యవర్గానికి శనివారం నియామకపత్రం అందజేశారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డి, హరిబాబు మాట్లాడారు. కన్వీనర్‌గా గంద్రాతి శ్రీనివాస్, కోకన్వీనర్లుగా కోడి మల్లేశ్, రమేశ్, మండల ఇన్‌చార్జులుగా రజనీకాంత్, కృపాకర్‌రెడ్డి, రాజు, విష్ణు, జాఫర్‌లను నియమించారు.

కనుగుల వేణుకు నివాళి

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరికి చెందిన కళాకారుడు కనుగుల వేణుకు ఆయన నివాసంలో శనివారం నిర్వహించిన సంతాప సభలో పలువురు గాయకులు నివాళులర్పించారు. తొలుత రచయిత, గాయకుడు తాళ్ల సునిల్ ఆధ్వర్యంలో సినీగేయ రచయిత గిద్దె రాంనర్సయ్య పాటలతో నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గాయకులు కంబాలపల్లి సత్యనాయుడు, పడిదం రాజేందర్, గాదె పాక బాబు, బక్కి యాదగిరి, బరిగల రవిందర్, రవిందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మండలంలోని లింగగిరికి చెందిన కళాకారుడు కనుగుల వేణు ఇటీవల మృతి చెందగా అతడి సోదరి జ్యోతితో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం అందించారు. సాయం అందించిన వారిలో అశ్విని, రజిత, వీరేష్, రాంబాబు, రాజు, సతీష్ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ దినోత్సవం

వర్ధన్నపేట : పట్టణంలో ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీకటిని పారద్రోలి ప్రపంచానికి వెలుగును ప్రసాదించిన థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి ఎలక్ట్రీషియన్లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజిడి వాసుదేవరెడ్డి, మహేందర్‌రెడ్డి, తక్కళ్లపెల్లి విష్ణుప్రసాద్, దాసరి భిక్షపతి, బాలాజీ, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

గీసుకొండ : మండలంలోని కోనాయమాకులలో రూ.3 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రెయినేజీ, స్మశానవాటిక వద్ద బోరు ఏర్పాటు పనులను ఎంపీపీ బీమగాని సౌజన్య శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చాడ కొమురారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

పర్వతగిరి : వడ్లకొండలో రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం వరంగల్‌కు చెందిన తేనె సుష్మ–రతీశ్ దంపతులు రూ.లక్ష 116 విరాళం అందజేశారు.

దర్గా ఉత్సవాలు ప్రారంభం

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటలోని గుండం చెరువు కట్టపై ఉన్న దర్గాలో ఉర్సు ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు గ్రామ చావడి నుంచి ప్రజలు డప్పు చప్పుళ్లు, ఖవాలీ పాటలతో ఊరేగింపుగా దర్గాకు తరలించి గంధం సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు జబ్బార్, సర్పంచ్ మోడెం విద్యాసాగర్, ఉపసర్పంచ్ ఏకాంబరం, ఎంపీటీసీ చంద్రు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో మెరుగైన విద్య

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : పట్టణంలోని తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో మెరుగైన విద్యాబోధన అందుతుందని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆ గురుకుల పాఠశాల, కళాశాలలో అడ్మిషన్ల కరపత్రాలను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాలలో 5వ తరగతి, కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మైనార్టీ విద్యార్థులకు 75 శాతం, ఇతర కులాలకు 25 శాతం చొప్పున సీట్లు భర్తీ చేస్తారని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ప్రవేశాలు పొందాలని సూచించారు. సకాలంలో దరఖాస్తు చేసుకుని అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.శ్రీపాల, ఉపాధ్యాయురాలు మాధవి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

యూత్ కాంగ్రెస్ నాయకుడికి అభినందన

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మోడెం ఎల్లాగౌడ్‌ను రాష్ట్రస్థాయిలో ప్రశంసా పత్రం అందుకున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎల్లాగౌడ్ ఎనలేని కృషి చేశారని చెప్పారు. రాష్ట్రంలో 14వ, జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాడని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

రాంరెడ్డి మృతి తీరని లోటు

నెక్కొండ : మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కంది రాంరెడ్డి (87) మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. రాంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా శనివారం నిర్వహించిన అంతిమ యాత్రలో ఎమ్మెల్యే మాధవరెడ్డి పాల్గొని నివాళులర్పించి మాట్లాడారు. పార్టీ నాయకుడిగా రాంరెడ్డి అందించిన సేవలను గుర్తు చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు రాచకొండ రఘు, కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయికృష్ణ, మహ్మద్ అన్వర్‌పాషా, రావుల మహిపాల్‌రెడ్డి, బక్కి నరేశ్ పాల్గొన్నారు.



నర్సంపేట: ఎల్లాగౌడ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

సర్వేయర్‌కు సన్మానం



చెన్నారావుపేట : సర్వేయర్ విద్యశ్రీని సన్మానిస్తున్న తహసీల్దార్, ఉద్యోగులు

చెన్నారావుపేట : రెవెన్యూ కార్యాలయ సర్వేయర్ విద్యశ్రీ,ని ఉత్తమ సర్వేయర్‌గా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నేపథ్యంలో తహసీల్దార్ ఫణికుమార్, ఉద్యోగులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. విధినిర్వహణలో అంకితభావంతో పని చేస్తే గుర్తింపుతోపాటు అవార్డులు వస్తాయని చెప్పారు. విద్యశ్రీని అభినందించారు. కార్యక్రమంలో గిర్దావర్ స్వామి, సీనియర్ అసిస్టెంట్ కొండమల్ల రవికుమార్, జూనియర్ అసిస్టెంట్ అమ్జద్ ఖాన్, కోరె శోభారాణి, డేగల రాజు, ధారావత్ సంతోశ్, రికార్డ్ అసిస్టెంట్ చాగంటి శివకోటి, మండల చిన్న నర్సింహరాములు, పడిదం శ్రీనివాస్, ఆఫీస్ సబార్డినేట్ డేగల నర్సయ్య, కప్పల నర్సయ్య, మొగిలి పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : వార్డెన్ రాజయ్యను సన్మానిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హాస్టల్ వార్డెన్‌కు..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ శివారులోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ కళాశాల హాస్టల్ వార్డెన్ బైరగోని రాజయ్యను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ వార్డెన్‌గా అవార్డు అందుకున్న నేపథ్యంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, శ్రీకాంత్,ప్రణయ్, ప్రశాంత్, గణేశ్, రాజు, రఘు, రమేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో 'కేంద్రం' విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

గీసుకొండ : కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన యూనియన్ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ శక్తులను ప్రోత్సహిస్తూ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఉద్యోగ, ఉపాధి కల్పనలోనూ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు తొగటి బ్రహ్మచారి, బిల్డింగ్ సంఘం మండల కార్యదర్శి గోరుకంటి రమేశ్, కోశాధికారి దుపాకి రాజు, ఆశ కార్యకర్తల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇసంపెల్లి వజ్ర, చినగారి రాణి, గ్రామ పంచాయతీ సిబ్బంది సంఘం మండల కార్యదర్శి మాదాసి స్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికలో గెలుపే లక్ష్యం'



వర్ధన్నపేట : మాట్లాడుతున్న రత్నం సతీశ్ షా

వర్ధన్నపేట : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల విభాగం వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ రత్నం సతీశ్ షా కోరారు. మండలంలోని ఇల్లందలోని పార్టీ వర్ధన్నపేట రూరల్ మండల కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ రాయపురకు కుమారస్వామి అధ్యక్షతన శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా సతీశ్ షా హాజరై మాట్లాడారు. విద్యావంతులు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ కోకోఆర్డినేటర్లు కుడికాల శ్రీధర్, పెద్దూరి రాజ్‌కుమార్, పర్వతగిరి మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నర్సంపేట : మాట్లాడుతున్న నాయకులు

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

నర్సంపేట : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, ఎన్నికల ఇన్‌చార్జులు గోనె యువరాజు, రాయిడి దుశ్యంత్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2020–21 విద్యాసంవత్సరం నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు, గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన యువత ఫిబ్రవరి 6లోగా ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో అన్ని వార్డుల్లో ఉన్న పట్టభద్రులను గుర్తించి పార్టీ కార్యాలయంలో ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మహేందర్, నాయిని వేణు, బైరి నాగరాజు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- టీఆర్‌వీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్య

నర్సంపేట : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని తెలంగాణ రజక వృత్తిదారుల సమైఖ్య (టీఆర్‌వీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లంద సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహ సమీపంలో సమైఖ్య నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. రజకులు అన్ని రంగాల్లో తీవ్ర వెనుకబాటుకు గురౌతున్నారని తెలిపారు. సరైన ఉపాధి లభించక కుటుంబ పోషణలో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడానికి శాఖపరమైన చర్యలు చేపట్టాలని, రజక ఫెడరేషన్‌కు పాలక మండలిని నియమించి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, రజక వృత్తిదారుల కోసం వచ్చిన అన్ని జీఓలను అమలు చేయాలని, 50 ఏళ్లకుపైబడ్డ వృత్తిదారులకు పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మామిడాల నర్సయ్య, కొల్లూరి లక్ష్మినారాయణ, రాయరాకుల శ్రీను, గడ్డమీది బాలకృష్ణ, గుడికందుల సదానందం, రమేశ్, మామిడాల కాంతయ్య, వావిళ్ల ప్రసాద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సాంబయ్య, నాయకులు

జీఎంపీఎస్ క్యాలెండర్..

చెన్నారావుపేట : తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ ఫణికుమార్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధూకర్, అమీనాబాద్ సర్పంచ్ సిద్దన రమేశ్, మండల కార్యదర్శి జక్క రవి, గౌరవ సలహాదార్లు ఆవుల రాములు, ఉపాధ్యక్షుడు దొంగల రాజ్‌కుమార్, నాయకులు జక్క వెంకన్న, తొగరు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ఫణికుమార్

సూర్యాపేట జిల్లామీదుగా సాగిన పాదయాత్ర

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి చేపట్టిన భూపాలపల్లి టు తిరుపతి పాదయాత్ర శనివారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా మండలంలోని నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయంలో అమ్మవారికి గండ్ర జ్యోతి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భూపాలపల్లిలో నిర్మించ తలపెట్టిన వేంకటేశ్వర స్వామి ఆలయం సంవత్సరకాలంలోనే అత్యంత అద్భుతంగా పూర్తయిందన్నారు. 8వ రోజు పాదయాత్రలో దండుమైసమ్మ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషదాయకంగా ఉందన్నారు. నెమ్మికల్‌లో జరిగిన పాదయాత్రలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గద్దల మల్లయ్య, జలగం లచ్చయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎస్ఆర్ఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరామర్శించి క్వింటా చొప్పున బియ్యం అందజేశారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

ఖానాపురం : ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని డీపీఎం భవానీ, ఏపీఎం కందిక సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. మహిళలు, బాలికలు ఎలాంటి సమస్యలు ఎదురైనా టోల్ ఫ్రీ నంబర్ 181, 100లకు సమాచారం అందించి సాయం పొందాలని చెప్పారు. కూతుర్లను కొడుకులతో సమానంగా పెంచాలని తల్లిదండ్రులను కోరారు. తొలుత హెల్ప్‌లైన్ నంబర్లతో ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సఖి సెంటర్ కౌన్సిలర్ నిర్మలాదేవి, శ్రీలత, రాధిక, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీపీఎం, ఇతరులు

క్రీడలతో మానసిక, శారీరక వికాసం



బ్యాడ్మింటన్ క్రీడాకారులతో వీరన్న, తదితరులు

పర్వతగిరి : క్రీడలు మానసిక, శారీరక వికాసం కలుగుతుందని జిల్లా కోఆప్షన్ సభ్యుడు సర్వర్, సర్పంచ్ కొల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని దౌలత్‌నగర్‌లో దౌలత్‌నగర్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి ఇన్విటేషన్ టోర్నమెంట్ క్రీడాపోటీలు శనివారం నిర్వహించగా వరంగల్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.వీరన్న, ఆర్గనైజర్ పిండి కొమురయ్య ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వర్, వెంకటేశ్వర్లు, వీరన్న, కొమురయ్య మాట్లాడారు. కొందరు క్రీడాకారులు సంఘటితమై దౌలత్‌నగర్‌లో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. పోటీల్లో 13 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో క్రీడాకారులు బండి వెంకటేశ్వర్లు, పిండి మల్లికార్జున్, కత్తుల శ్రీనివాస్, నల్లగొండ సూర్యప్రకాశ్, ఎస్ఎంసీ చైర్మన్ బొమ్మెర సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కష్టాల కడలి నుంచి రచనలకు శ్రీకారం

- ప్రముఖ కవి, రచయిత యాకూబ్‌రెడ్డి ప్రస్థానం

నర్సంపేట: తన జీవితపు అనుభవాల సారం నుంచి సమాజంలోని అన్ని రకాల మనుషులను చూసి చదివిన అనుభవాలను రంగరించి అణిముత్యాల్లాంటి పదాలతో కవిత్వం రాయడం ఆయన సొంతం. మారుమూల పల్లెలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగాడు. చిత్తు పేపర్లపై కవితలు రాసి కష్టాలను ఎదుర్కొన్నాడు కేతిరెడ్డి యాకూబ్‌రెడ్డి. ఉపాధ్యాయుడిగా, కవిగా అందరికీ సుపరిచితుడు. ఆయన ఇటీవల రాసిన రెండో కవితా సంపుటి 'రెండు ప్రేమల వాన' నేడు (ఆదివారం) ఆవిష్కరించనున్నారు.

జిల్లాలోని పర్వతగిరి మండలంలోని బూర్గుమల్ల గ్రామానికి చెందిన కేతిరెడ్డి రామక్క–నర్సింహారెడ్డి దంపతుల ఐదో సంతానంలో చిన్నవాడు యాకూబ్‌రెడ్డి. ఆయన ప్రాథమిక విద్య స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పూర్తి చేశాడు. ఆరు, ఏడు తరగతులను కాలినడకన 5, 6 కిలోమీటర్లు నడిచి పర్వతగిరి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి చదివాడు. ఆయన ఏడో తరగతిలో ఉండగా తల్లి కాలం చేయగా నర్సంపేటలోని చిన్నమ్మ ఎర్ర అమృతమ్మ చదివించింది. అక్కడే 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకున్నాడు.

తెలుగు ఉపాధ్యాయుడిగా...

డిగ్రీ పూర్తైన వెంటనే ప్రైవేటు పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా చేరాడు. కొంత కాలం తర్వాత మంచిర్యాల సమీపంలోని రామకృష్ణాపూర్‌కు వెళ్లారు. అక్కడ 12 ఏళ్లు కిరాణా షాపు నడిపించడంతోపాటు పిల్లలకు ట్యూషన్ చెప్పాడు. కొంత కాలం పత్రిక విలేకరిగా పని చేశాడు. 1999లో తిరిగి నర్సంపేటకు చేరుకున్నాడు. 2003లో కేయూలో ఎంఏ తెలుగు, 2006లో సంస్కృతం పూర్తి చేశాడు.

కవిగా పరిచయం


మొదటి నుంచి ఉన్న పుస్తక పఠనం, సాహితీవేత్తల పరిచయం, సమస్యల ప్రయాణం, సమాజ అధ్యయనం తనలో కవిని నిద్ర లేపింది. తన జీవితంలో ఎదుర్కొన్న అనుభవాలు కవితా వస్తువులుగా అనేక పత్రికల్లో ఆయన కవితలు ముద్రితమయ్యాయి. 'ఓ మధ్య రకపు మానవా'.. నీ బాధలన్నీ నాకు తెలియవా అంటూ మొదటి కవిత 1986లో తన కలం నుంచి జాలు వారింది. స్నేహితుడు చుక్కల సుదర్శన్ ప్రోత్సాహంతో మొదటి కవితా సంపుటి 'కొన్ని కలలు కొన్ని కన్నీళ్లు, ఒక సునామీ'ని 2012లో ప్రముఖ కవి నందిని సిధారెడ్డి సమక్షంలో పరిచయం చేశారు.

నేడు 'రెండు ప్రేమల వాన'గా..



ప్రస్తుతం ఆయన రెండో కవితా సంపుటి 'రెండు ప్రేమల వాన' ఆవిష్కరణకు సిద్ధమైంది. సమాజంలో చోటు చేసుకున్న సమస్యలు, యాంత్రికత ప్రధాన వస్తువులుగా 'రెండు ప్రేమల వాన'లో మనం చూడవచ్చు.

అనేక సామాజిక అంశాలు, ప్రజాసమస్యలపై కవితలు



ఓవైపు సామాజిక అసమానతలు అతలాకుతలం చేస్తుంటే మరో వైపు కుటుంబ బంధాలు ఆర్థిక సంబంధాలుగా మిగిలిపోవడం బాధాకరం. మానవత్వం అడుగంటిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో మనిషి ఒంటరివాడుగా మిగిలిపోవడం కలిచి వేస్తున్న అంశం. ఈ అంశాలే నా కవిత్వంలో ప్రధాన వస్తువులు.

-కేతిరెడ్డి యాకూబ్‌రెడ్డి, కవి, నర్సంపేట


ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నర్సంపేట : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో కార్తీక్ ఆధ్వర్యంలో ఆ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగేళ్లుగా రూ.5,166 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. చదువు మానేసే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, ఎస్.ప్రవీణ్, కిశోర్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ముఖ్యనాయకులతో సమావేశం

నర్సంపేట : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రేపు (సోమవారం) నర్సంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో 29న ఉదయం 10.30 గంటలకు సమావేశం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ ముఖ్యనాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్లు, క్లస్టర్ బాధ్యులు, కౌన్సిలర్లు, అన్ని స్థాయిల నాయకులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖానాపురం : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో శనివారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల్లా వ్యవహరించి విద్యాబోధన చేశారు. డీఈఓగా యశ్వంత్ సిద్దు, డిప్యూటీ డీఈఓగా అభినయ్ సాయి, ఎంఈఓగా కార్తీక్ చౌదరి, ఎంఎస్ఓగా విజయ్‌కుమార్, హెచ్ఎంగా హర్షవర్ధన్ వ్యవహరించారు. కార్యక్రమానికి ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు రామ్మోహన్‌రావు, కరంచంద్, సోమలక్ష్మి, రవికుమార్, సరిత, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ఖానాపురం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అదనపు డీఆర్‌డీఓ గొట్టె శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘాల అకౌంటింగ్ వివరాలను లోకోస్ యాప్‌లో త్వరగా ఎంట్రీ చేయాలన్నారు. నాన్‌ఫామ్స్ సబ్జెక్టులో ఆదాయాన్ని పెంపొందించుకునేలా కార్యక్రమాలు చేసుకోవాలన్నారు. బ్యాంకు లింకేజీ ఫిబ్రవరి మొదటి వారంలోపు అవసరం ఉన్న సంఘాలకు వందశాతం ఇప్పించాలని చెప్పారు. ఏపీఎం కందిక సుధాకర్, దయాకర్, చంద్రశేఖర్, భవాని, కవిత, కృష్ణకుమారి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైమరీ స్కూల్‌కు మైక్‌సెట్ బహూకరణ

పర్వతగిరి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు శనివారం వైర్‌లెస్ మైక్‌సెట్ బహూకరించారు. ప్రధానోపాధ్యాయురాలు కతీజుల్ ఖుబ్ర అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సర్పంచ్ మాలతి సోమేశ్వర్‌రావు, మండల నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రమేశ్, అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ గవర్నర్ లింగమూర్తి, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహంకాళి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.